క్లుప్తంగా

రోడ్లపై చెత్తకుప్పలు తొలగించాలి

కాజులూరు: మండలంలోని కోలంకలో రోడ్లపై పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించేందుకు పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో ఏ ఒక్క ప్రాంతంలో డంపింగ్ యార్డు సదుపాయం లేకపోవడంతో స్థానికులు గృహవాసాల్లోన్ని చెత్తా చెదారం గ్రామ ముఖద్వారంలోని రోడ్డుపక్కన పారవేస్తున్నారు. పశువులు, కుక్కలు, కోళ్ల సంచారంతో రోడ్డు పక్కన పారవేసిన చెత్తకుప్పలు రోడ్లపైకి పొల్లుకు వస్తూ దుర్వాసన వస్తున్నాయని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. చెదురుమదురు వర్షాల కారణంగా పరిస్థితి మరీ అధ్వానంగా తయారయిందన్నారు. అధికారులు స్పందించి చెత్త కుప్పలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని బాధిత ప్రజలు కోరుతున్నారు.

ఎమర్జెన్సీకి నిరసనగా కాగడాల ర్యాలీ



హసన్‌బాదలో కాగడాలతో ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ సతీష్‌రావు తదితరులు

రామచంద్రపురం రూరల్: కాంగ్రెస్ పార్టీ పాలనలో 1975 జూన్ 25 న దేశంలో అత్యవసర పరిస్థితి(ఎమర్జెన్సీ) విధించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ పిలుపు మేరకు హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో బుధవారం కాగడాల ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ సతీష్‌రావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని మంటకలిపి, పత్రికా స్వేచ్ఛని హరించి ఎమర్జెన్సీ దేశంలో చీకటి అధ్యాయంగా మిగిలిపోయిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ చీకటి పాలనకు నిదర్శనం



వల్లూరి పార్థసారథిని సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): ఎమర్జెన్సీ అప్రజాస్వామిక చర్యకు 50 సంవత్సరాలు ముగిసిన సందర్భంగా పట్టణంలో ఎమర్జెన్సీ కాలంలో అరెస్టుచేసిన మండపేటకు చెందిన వల్లూరి విజయానంద పార్థసారథిని ఆయన నివాసంలో బీజేపీ నాయకులు సత్కరించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంవిధాన్ హత్యా దివస్ పేరుతో ప్రిన్సిపాల్ డాక్టర్ టీకేవీ శ్రీనివాస రావు అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర మాదిగ ఫైనాన్సియల్ కార్పొరేషన్ డైరెక్టర్ మండపల్లి చంద్రశేఖర్ ఎమర్జెన్సీ పరిస్థితులను వివరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ మాట్లాడుతూ 1975–1977 మధ్యకాలంలో 21 నెలలు అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అమలు చేసిన ఎమర్జెన్సీలో వల్లూరి విజయానంద పార్థసారథిని 11 నెలలు జైళ్లలో నిర్బంధించారన్నారు. కార్యక్రమాల్లో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్, బీజేపీ నాయకులు వల్లభనేని రవీంద్రబాబు, కంకటాల మురళీకృష్ణ, గొడవర్తి రామచంద్రరావు, ఆరెస్సెస్ నాయకుడులు చక్రవర్తి, ప్రసాద్, మద్దుల సుబ్బారావు, చుండ్రు సాయిరాం పాల్గొన్నారు.

మాజీ ఉప సర్పంచ్ మృతి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం కేశవరం గ్రామానికి చెందిన మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు, మాజీ ఉప సర్పంచ్, కూటమి నాయకుడు ఉండమట్ల రామారావు (73) బుధవారం మృతి చెందారు. మూడు రోజుల క్రితం అనారోగ్యంతో రాజమండ్రిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరగా చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతికి ఎమ్మెల్యే జోగేశ్వరరావు, రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ మూర్తి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్న బాబు, మాజీ ఎంపీపీ అడబాల బాబ్జి, కాపు సంఘం నాయకుడు జిన్నూరి సత్యసాయి బాబా, పిల్లా తాతాలు, నాగిరెడ్డి రాంబాబు, వరదా చక్రవర్తి, చిక్కాల శ్రీనివాసరావు, తులా శేషారావు, తులా రంగారావు, తిరుసూల శ్రీనివాస్, పిల్లా అరవరాజు సంతాపం వ్యక్తం చేశారు.

మాదకద్రవ్యాల జోలికి యువత పోవద్దు

రావులపాలెం: యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా మంచి అలవాట్లు చేసుకోవాలని రావులపాలెం టౌన్ సీఐ శేఖర్ బాబు, కొత్తపేట ఎక్సైజ్ సీఐ కాత్యాయని అన్నారు. ఈనెల 26వ తేదీ అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక టీఎస్ఎన్‌బీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సీఐ శేఖర్‌బాబు, కాత్యాయని మాట్లాడుతూ మత్తు పదార్థాల జోలికి యువత పోవడం వల్ల జరిగే నష్టాలను వివరించారు. యువత మాదకద్రవ్యాలను నిర్మూలించడంలో ముఖ్యపాత్ర పోషించాలని, వాటిని తరలించేవారు, విక్రయించేవారు, సేవించేవార్లను గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే యువత ఇటువంటి చెడు అలవాట్ల జోలికి వెళ్లకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు.

కర్బనం నిండుగా.. సాగు పండుగ

- లోపిస్తే దిగుబడులపై ప్రభావం
- పశువుల వ్యర్థాలతో లోపానికి చెక్



పచ్చిరొట్ట పైరును ట్రాక్టర్‌తో పొలంలో కలియదున్నుతున్న దృశ్యం

రామచంద్రపురం రూరల్: నేలలో కర్బన పదార్థం పుష్కలంగా ఉంటే పంటల సాగు పండగలాగా సాగుతుందని పరిశోధనల్లో వెల్లడైన సత్యం. అందుకే భూసార పరీక్షల్లో వెల్లడైన అంశాల ఆధారంగా భూమిలో సేంద్రియ కర్బన లోపం లేకుండా చూసుకోవాల్సి ఉంటుందని రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ అంటున్నారు.

సాగు భూముల్లో సేంద్రియ కర్బన లోపం పంటల దిగుబడులు పడిపోయేందుకు ప్రధాన కారణంగా మారుతోంది. సేంద్రియ కర్బనం సాగు నేలకు ముఖ్యమైంది. ఇది పంటల పెరుగుదలపై అన్ని దశల్లో ప్రభావం చూపుతుంది. దీని లోపం వల్ల పంటల దిగుబడులు సగానికి దిగజారుతున్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధనల్లో వెల్లడైంది. ఈ కర్బనాన్ని నేలలో మరింత తగ్గుముఖం పట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటే రైతు ఆశించిన స్థాయిలో అధిక దిగుబడులు పొందవచ్చు. సాగు నేల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుంటేనే నేలలో సేంద్రియ కర్బనాన్ని రైతు కాపాడుకోవచ్చు.

లోపంతో దుష్పరిణామాలివీ..

సేంద్రియ కర్బనం లోపించిన నేలలు నిస్సారంగా తయారవుతాయి. పైర్ల ఎదుగుదల బాగా కుంటుపడుతుంది. ఆకుల్లో పత్రహరితం లోపిస్తుంది. వరి పైరుకు వచ్చేసరికి వెన్ను పొడవుగా తయారు కాకుండా అడ్డుకుంటుంది. వెన్నులో వడ్ల గింజల సంఖ్య తగ్గుతుంది. తాలు, తప్పలు ఎక్కువగా వస్తాయి. ఆకులు పొట్టిగా సన్నగా అవుతాయి. వరి మొక్క పెరుగుదల కురచగా మారిపోయి పిలకలు తగ్గుతాయి. దీంతో దిగుబడులు గణనీయంగా పడిపోతాయి. భూసార పరీక్షల్లో సేంద్రియ కర్బన లోపం నత్రజని స్థాయిని తెలియజేస్తుంది. కర్బనం తక్కువగా ఉన్న నేలల్లో 75 కేజీల నత్రజని ఎరువులను ఎక్కువగా వాడవచ్చు. నేలలో కర్బనం ఎక్కువగా ఉంటే నత్రజనిని 60 కేజీల వరకు మూడు మోతాదుల్లో తక్కువగా వేయాలి.

పాడి పరిశ్రమతో కర్బన లోపానికి చెక్

సాగు భూముల్లో సేంద్రియ కర్బన లోపం ఎక్కువగా ఉంటోంది. వంద శాతం మట్టిలో ఉండాల్సిన కర్బనం 30 శాతానికి పడిపోయిందంటే రైతులే దీర్ఘకాలికంగా చేసుకుంటున్న పొరపాటని చెప్పాలి. ఈ పరిమాణంతో రైతు చేతికి 40 బస్తాలు అందాల్సిన పంట 20 బస్తాలకు పడిపోతోంది. గతంలో పాడి, పంట వేర్వేరుగా ఉండేవి కాదు. పాడి, పంట కలిస్తేనే వ్యవసాయంగా రైతులు భావించేవారు. కానీ అది ప్రస్తుత కాలంలో కొరవడింది. ఆ కారణంగానే నేలలో ఈ విపరీత సమస్య వచ్చింది. పశువుల నుంచి వచ్చే పెంట పోగును పుష్కలంగా పొలంలో చల్లితే ఈ సమస్య నివృత్తి అవుతుంది. దీనివల్ల సేంద్రియ కర్బన శాతం నేలలో పెరిగి, సమస్య అంచెలంచెలుగా తగ్గిపోతుంది. వానపాముల ఎరువును వాడితే మరింతగా ఈ లోపాన్ని సరిచేయవచ్చు.



టీవీఆర్ మణిదీప్, ఏవో, రామచంద్రపురం మండలం

క్లస్టర్ పరిధిలో వరి సాగు వివరాలిలా..

మండలం	వరి పంట సాగు ఎకరాల్లో..
రామచంద్రపురం	17,963
కె.గంగవరం	15,589
కాజులూరు	19,083
కపిలేశ్వరపురం	15,763
రాయవరం	14,101
మండపేట	16,008

సమగ్ర పోషక యాజమాన్యంతోనే సాధ్యం

సేంద్రియ కర్బనాన్ని సాగు నేలల్లో పెంపొందించేందుకు సమగ్ర పోషకాల యాజమాన్యంతో సాధ్యమవుతుంది. సేంద్రియ ఎరువు అందుబాటులో లేనప్పుడు వీలును బట్టి జీలుగ, జనుము, అలసంద, పిల్లి పెసర మొదలైన పైర్లను పెంచాలి. ఈ పచ్చిరొట్ట పైర్లు పెరిగాక సాగుకు ముందు దమ్ముల్లో కలియదున్నాలి. అప్పుడు పచ్చిరొట్ట ఎరువులోని పోషకాలు నేలలోకి ఇమిడి, పంట పెరుగుదలకు దోహదపడుతుంది. సేంద్రియ ఎరువులు వాడినప్పుడు రసాయన ఎరువుల ద్వారా వేసే నత్రజని మోతాదును 20–25 శాతం వరకు తగ్గించాలి. అజోల్లా వాడితే తక్కువ ఖర్చుతో ఎకరానికి 10–12 కేజీల నత్రజనిని పైరుకు అందిస్తుంది. సుస్థిర అధికోత్పత్తికి లోపస్థాయిలో ఉన్న అన్ని పోషకాలను పైరుకు సరఫరా చేసే ఎరువులు వేయాలి. భూసార పరీక్షల్లో నిర్ధారించిన నేలల్లోని పోషక లోపాలను బట్టే ఎరువుల వాడకం ఉండాలి.

గ్రాట్యుటీ బకాయిలు చెల్లించాలి



యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు డీవీ రాఘవులు

కపిలేశ్వరపురం: ప్రభుత్వ రంగంలో ఉద్యోగ విరమణ సందర్భంగా అందజేయాల్సిన గ్రాడ్యుటీ తదితర ప్రయోజనాలను త్వరితగతిన చెల్లించాలని పదమర ఖండ్రికకు చెందిన మాజీ యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు డీవీ రాఘవులు బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రాడ్యుటీ చట్టం 1972 ప్రకారం ఉద్యోగ విరమణ అనంతరం 2018 వేతన సవరణ ఆధారంగా రూ.16 లక్షలకు మించకుండా బహుమతిగా చెల్లించాల్సి ఉందని, ప్రస్తుత ప్రభుత్వం 2024 సెప్టెంబర్ తర్వాత ఉద్యోగ విరమణ చేసిన వారికి ఇప్పటి వరకూ గ్రాడ్యుటీ చెల్లించలేదన్నారు. ప్రభుత్వం మానవత్వ కోణంలో ఆలోచించి త్వరితగతిన గ్రాడ్యుటీ సొమ్మును చెల్లించాలని డిమాండ్ చేశారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

రాయవరం: స్థానిక సత్యసాయి ధ్యాన మందిరంలో బుధవారం ఉచిత ధ్యాన శిబిరాన్ని నిర్వహించారు. ప్రతి నెలా అమావాస్య రోజున వెలగల వెంకటరెడ్డి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ ధ్యాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ధ్యాన శిబిరంలో పిరమిడ్ మాస్టర్ పద్మావతి పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం ధ్యానం చేయడం వలన మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. తద్వారా ఆరోగ్యవంతులవుతారని, జీవన ప్రమాణం పెరుగుతుందని తెలిపారు.

యోగా నిర్వాహకులకు ప్రశంసా పత్రాలు



జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఆర్డీఓ అఖిల, తహసీల్దార్ మృత్యుంజయరావు, ఎంపీడీఓ పద్మజ్యోతి, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు, భీమేశ్వరాలయ ఈఓ వెంకట దుర్గాభవాని (కుడి నుంచి ఎడమకు)

రామచంద్రపురం రూరల్: ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 2 వేల మందితో విజయవంతంగా యోగా కార్యక్రమం నిర్వహించినందుకు రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల, తహసీల్దార్ బండి మృత్యుంజయ రావు, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు, భీమేశ్వరాలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవానిలను జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ రావిరాల, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతిలు బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని గోదావరి భవన్‌లో ఘనంగా సత్కరించి, ప్రశంసా పత్రాలు అందజేశారు.

అధికారుల తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న లేబర్ ఆఫీసర్ మల్లేశ్వరరావు, తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, చట్టాన్ని అతిక్రమించినవారికి కఠిన శిక్షలు తప్పవని లేబర్ ఆఫీసర్ కాశి శివనాగ మల్లేశ్వరరావు, హెచ్చరించారు. కార్మిక శాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఆయన బుధవారం మండపేట, ఆలమూరు మండలాల్లోని పలు ప్రదేశాల్లో తనిఖీలను నిర్వహించారు. నాగ మల్లేశ్వరరావు పర్యవేక్షణలో విద్యాశాఖ సీఆర్పీ శేషగిరి రావు, ఏఎస్సై వెంకటేశ్వరరావు, అలెర్ట్ నాగో జిల్లా కో- ఆర్డినేటర్ శ్రీనివాస్, శ్రమ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి దుర్గారావు క్షేత్ర స్థాయిలో బాల కార్మికుల గుర్తించేందుకు తనిఖీలు చేపట్టారు. 18 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలను పనిలోకి పెట్టుకోవడంతో పడే శిక్షలకు సంబంధించి పూర్తి వివరాలను దుకాణాల యజమానులకు అధికారులు అవగాహన కల్పించారు.



జోరువానకు గొల్లపాలెంలో జలమయమైన కాకినాడ-కోటిపల్లి రహదారి

కాజులూరు: మండల గ్రామాల్లో జోరువాన కురిసింది. గత రెండు రోజుల నుంచి చెదురుమదురుగా వర్షపు జల్లులు పడుతుండగా బుధవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం పడటంతో ప్రజలు బయటకు వచ్చేందుకు వీలులేక జనజీవనం దాదాపు స్తంభించింది. గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు, వీధుల్లో వర్షపునీరు చేరి జలమయమవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాకినాడ, కోటిపల్లి రహదారిలో గొల్లపాలెం చెరువుగట్టు సెంటర్ వద్ద భారీగా వర్షపునీరు నిలిచిపోయి రోడ్డు మునిగిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాలోనూ తరచూ అంతరాయాలు ఏర్పడటంతో ఇబ్బందులు తలెత్తాయి. మండల గ్రామాల్లో ప్రస్తుతం రైతులు దాళ్వా మాసూళ్లు పూర్తి చేసుకుని తొలకరి సాగుకు సిద్ధమౌతున్నారు. అయితే ప్రభుత్వం గోదావరి నది నుంచి డెల్టా కాలువకు నీరు విడుదల చేసినప్పటికీ కాలువ శివారు భూములకు సాగు నీరందకపోవడంతో పంటదమ్ములకు వీలు లేకుండా పోయింది. ఈ తరుణంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తొలకరి పనులు ప్రారంభిస్తున్న తమకు ఎంతో మేలు చేస్తాయని పలువురు రైతులు చెబుతున్నారు.

సీజనల్ వ్యాధుల నివారణే లక్ష్యంగా పనిచేయాలి



మలేరియా నివారణ మాసోత్సవాల ర్యాలీలో పాల్గొన్న యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు

ఆలమూరు: సీజనల్ వ్యాధుల నివారణే లక్ష్యంగా పనిచేసి అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టాలని జిల్లా మలేరియా యూనిట్ అధికారి నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని చొప్పెల్ల పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పలు గ్రామాల్లోని సబ్ సెంటర్లను పరిశీలించి సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. జ్వరాలను సంబంధించిన మందులు, పరీక్షలు అందుబాటులో ఉన్నాయో లేదోనని అలాగే ఫార్మసీని, ల్యాబ్‌లను పరిశీలించి సిబ్బంది అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి జ్వరాలు నియంత్రణకు ముందస్తు జాగ్రత్త చర్యలుగా అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలో మందులను అందుబాటులో ఉంచామన్నారు. అలాగే రక్త పరీక్షలకు అవసరమైన పరికరాలను అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహలత, బి.అనంతరామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్‌ఈ బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్ పి.శివప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర, తీర్థం



గరగలను ఎత్తి జాతర ప్రారంభిస్తున్న తొగరు మూర్తి

రామచంద్రపురం: పట్టణ దేవత ముత్యాలమ్మ వారి జాతర, తీర్థం మహోత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ముత్యాలమ్మ వారి ఆలయంలో పట్టణానికి చెందిన తొగరు మూర్తి కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించి అమ్మవారి గరగలను ఎత్తి జాతరను ప్రారంభించారు. తీన్మార్ డప్పులతో గరగల నృత్యాలతో చిన్నారుల సంప్రదాయ కోలాటాలతో, బాణసంచాతో వైభవంగా ఊరేగింపు నిర్వహించి ప్రతి గడపకు అమ్మవారి ఆశీర్వాదం అందించారు. వైఎస్సార్ నగర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్, పట్టణ ప్రధాన రహదారుల్లో ఊరేగింపు నిర్వహించి రాజగోపాల్ సెంటర్లో ముత్యాలమ్మ వారి ఆలయ గౌరవాధ్యక్షుడు తొగరు మూర్తి ఇంటికి చేరుకుని వారి కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. ఊరేగింపులో పాల్గొన్న భక్తులకు ప్రజలకు శీతల పానీయాలను అందించారు. అనంతరం ఆలయం వద్ద విద్యార్థులకు పండితులతో సరస్వతీదేవి పూజలు నిర్వహించి పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు.

ఆలయం వద్ద అన్నదానం

అమ్మవారి తీర్థం సందర్భంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదానం కార్యక్రమాన్ని తొగరు మూర్తి ఆధ్వర్యంలో ప్రారంభించారు. రామచంద్రపురం పట్టణ ప్రజలు పరిసర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ముత్యాలమ్మ వారి ప్రసాదాలు స్వీకరించారు. తొగరు మూర్తి మాట్లాడుతూ 2007 నుంచి ఇప్పటివరకు ఏటా ముత్యాలమ్మ తీర్థం సందర్భంగా భక్తులకు అన్నదానం చేస్తున్నానని, అమ్మవారి జాతర పురస్కరించుకుని పట్టణ పరిసర ప్రాంత విద్యార్థిని విద్యార్థులు వారి లక్ష్యసాధనలో ఉన్నత శిఖరాలు సాధించాలనే ఉద్దేశంతో వారితో సరస్వతీ పూజలు నిర్వహించి పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో యానాదుల సంఘం అధ్యక్షుడు మర్రి గణపతి, కార్యదర్శి రెడ్డి కృష్ణ, మద్దెల అశోక్, కొమరగిరి వెంకటరమణ, గొర్రెల నరసింహమూర్తి, ఒబిలిశెట్టి బాబి, తొగరు సుబ్బారావు, తొగరు బ్రహ్మాజీ, దుర్గాప్రసాద్ అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆధునిక చికిత్సపై అవగాహన తప్పనిసరి



మండపేటలో పీఎంపీలకు అవగాహన కల్పిస్తున్న శ్రీకర్ హాస్పిటల్ వైద్యుడు

కపిలేశ్వరపురం (మండపేట): కమ్యూనిటీ పారామెడిక్స్ –ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండపేట పట్టణంలోని సూర్య గ్రాండ్ కాన్ఫరెన్స్ హాల్‌లో పీఎంపీలకు ఎముకలు, మెదడు, నరాల వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండపేట, ఆలమూరు, రాయవరం మండలాలకు చెందిన పీఎంపీలు హాజరయ్యారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాజమండ్రికి చెందిన శ్రీకర్ హాస్పిటల్ ఆర్థోపెడిక్ వైద్యులు డా.జి రోహిత్ కుమార్ ట్రామా కేసుల్లో అత్యవసర పరిస్థితులపైనా న్యూరో సర్జన్ డా.చంద్రకాంత్‌వర్మ, జనరల్ ఫిజీషియన్ డా.ఎన్‌జీ పృథ్వీకృష్ణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు, జిల్లా కార్యదర్శి సూరంపూడి వీరభద్రరావు, మండల ప్రధాన కార్యదర్శి ఇరవాడ రవికుమార్, ఇందన వెంకటేశ్వరరావు,పెదపాటి విష్ణు పాల్గొన్నారు.

వైభవంగా మావుళ్లమ్మ జాతర

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం మారేడుబాక గ్రామ దేవత శ్రీ మావుళ్లమ్మ జాతర ఉత్సవాలు బుధవారం భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ మేరకు అమ్మవారిని గ్రామంలోని పుర వీధుల్లో ఘనంగా ఊరేగించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ నెల 27 తీర్థం నిర్వహించనున్నట్టు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

విజయోత్సవాలు



విజయోత్సవ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

మలికిపురం: నాసా స్పేస్ ఎక్స్ యాక్సియం-4 మిషన్ విజయవంతమైన సందర్భంగా మండలంలోని వివేకానంద ఉన్నత పాఠశాలలో సంబరాలు జరుపుకొన్నారు. భారత వ్యోమగామి శుభాంశు శుక్లాకు శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు జై భారత్, జై జై భారత్ అంటూ నినాదాలు చేసి దేశభక్తిని చాటారు. పాఠశాల కరెస్పాండెంట్ ప్రసాద్ మాట్లాడుతూ భారత వ్యోమగామి శుభాంశు శుక్లాకు, నాసా బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు ఆస్ట్రోనాట్ శుభాంశు శుక్లా వేషధారణలో నిలిచి జేజేలు పలికారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విషప్రాణులతో సావాసం



మండపేట గొల్లపుంత కాలనీ నివాస స్థలంలో పేరుకుపోయిన పొదలు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని 20వ వార్డు గొల్లపుంత కాలనీలో ఖాళీ నివాస స్థలాలు ప్రమాదభరితంగా మారాయి. లబ్దిదారులు తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్లను నిర్మించుకోగా మరికొందరు ఖాళీగా వదిలేశారు. ఆ స్థలాల్లో చెట్లు మొలచి పొదలు అల్లుకుంటున్నాయి. విష ప్రాణులు సంచరిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయని కాలనీ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చైర్‌పర్సన్ రాణి స్వయంగా ప్రాతినిత్యం వహిస్తున్న వార్డు కావడంతో వెంటనే స్పందించి సదరు యాజమానులకు అవగాహన కల్పించి స్థలాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మాచవరంలో పెద్ద ఎత్తున ఇసుక నిల్వలు



మాచవరంలో నిల్వ చేసిన ఇసుకగుట్టలు

అంబాజీపేట: మండలంలోని మాచవరం శివారు ముంగండ సమీపంలోని ఖాళీ స్థలంలో పెద్ద ఎత్తున ఇసుకను గుట్టలుగా నిల్వ చేశారు. పి. గన్నవరం మండలం ముంగండ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఈ ఇసుకను నిల్వ చేసినట్లు తెలిసింది. రాబోయే వర్షాకాలంతో పాటు గోదావరి పాయకు వరద పోటెత్తితే ఇసుక తీసే అవకాశం లేకపోవడంతో ముందుగానే ఇసుకను భారీ ఎత్తున నిల్వ చేస్తున్నట్లు తెలిసింది. అనంతరం భారీ ఎత్తున విక్రయాలకు ఉపయోగపడేలా ప్లాన్ చేస్తున్నారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అధికారం మాది ఎక్కడైనా ఇసుక నిల్వ చేస్తాం అడిగేవారు ఎవరూ అన్నట్లుగా వ్యవహరిస్తున్న తీరుకు సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తారని, వారి అండతోనే అక్రమ ఇసుక వ్యాపారం జోరుగా సాగుతుందని పలువురు తెలిపారు. మాచవరంలో భారీ ఎత్తున ఇసుక నిల్వ చేసినట్లు అంబాజీపేట ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు తెలపడంతో ఇసుక నిల్వ చేసిన ప్రాంతానికి వీఆర్వోను పంపి విషయం తెలుసుకుంటానన్నారు.

జాబ్ మేళా



జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కేపీ రాజు, అధ్యాపకులు

కొత్తపేట: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కొత్తపేటలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో 11 కంపెనీలు జాబ్ మేళా నిర్వహించగా 513 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. వారి అర్హతలు పరిశీలించి, వారిలో 192 మందిని వివిధ కంపెనీల్లో వివిధఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ జి.రమేష్, వికాస జిల్లా మేనేజర్ కె.రాజేంద్రప్రసాద్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్, ఏపీఎస్‌ఎస్‌డీసీ సిబ్బంది, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

8 మంది డిగ్రీ విద్యార్థుల ఎంపిక

ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో స్థానిక కాపు కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 8 మంది ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. ఆ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ జాబ్ మేళాకు తమ కళాశాల నుంచి జేకేసీ, ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో 52 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 8 మంది ఎంపికయ్యారని, మరో 18 మంది తదుపరి ప్రక్రియకు ఎంపికై ఆయా కంపెనీల నుంచి నియామక పత్రాలను అందుకున్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ కేపీ రాజు, వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జి.శ్రీనివాసు, అధ్యాపకులు కె.సత్యనారాయణ, బి.సత్య తదితర అధ్యాపకులు అభినందించారు.